సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో ఎంపీ గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మేయర్ హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, తిప్పలనాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, సమన్వయకర్తలు కె.కె.రాజు, దేవన్‌రెడ్డి, పార్టీ నేతలు

పేదల ఇళ్లపై

కమీషన్ల దందా!

విశాఖలోనే రూ.5 కోట్లకుపైగా కలెక్షన్





- ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున వసూలు
- కాంట్రాక్టర్లకు గృహ నిర్మాణ శాఖ అధికారుల హుకుం
- లేదంటే బిల్లులు నిలిపేస్తామని బెదిరింపులు
- దుకాణం తెరిచిన నామినేటెడ్ పోస్టులోని కూటమి నేత
- కాంట్రాక్టర్లతో నేరుగా డీలింగ్



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

పేదల ఇళ్ల నిర్మాణాలపై కూటమి నేతలే కాదు అధికారులు కూడా గెద్దల్లా వాలిపోతున్నారు. ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున ఇస్తేనే బిల్లులు చేస్తామంటూ కాంట్రాక్టర్ల నుంచి వసూళ్లకు తెగబడుతున్నారు. గృహ నిర్మాణ శాఖకు చెందిన ఓ అధికారి కాంట్రాక్టర్లకు ఆదేశాలు కూడా జారీ చేసేశారు. ఒకవేళ అడిగిన మొత్తం ఇవ్వకపోతే బిల్లులు చేసేది లేదని తెగేసి చెప్పినట్టు సమాచారం. తమకు వారం వారం బిల్లులు నిలిచిపోయే ప్రమాదం ఉండటంతో కాంట్రాక్టర్లు కూడా అందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఒక్క విశాఖ జిల్లాలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్లు, ఇంకా ప్రారంభం కావాల్సిన ఇళ్ల నుంచి సదరు అధికారి ఏకంగా రూ.5 కోట్లకుపైగా వసూలు చేసేందుకు సిద్ధపడటం గమనార్హం. మరోవైపు నామినేటెడ్ పోస్టులోని కూటమి నేత ఒకరు కూడా వసూళ్ల దుకాణం తెరిచినట్టు తెలుస్తోంది. నేరుగా కాంట్రాక్టర్లతో డీలింగ్ చేసుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు తెలియకుండా ఏ ఒక్కరి బిల్లు కూడా జారీ కాకూడదంటూ హుకుం జారీ చేసినట్టు సమాచారం. ఒకవైపు అధికారులు, మరో వైపు కూటమి నేత వసూళ్లతో పేదల ఇళ్ల నిర్మాణం నాసిరకంగా మారనుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మీరు ఎలా ఇళ్లు నిర్మించి ఇచ్చినా.. ఎటువంటి విచారణ లేకుండా బిల్లులు మంజూరు చేస్తామంటూ హామీ లభిస్తుండటంతో కాంట్రాక్టర్లు కూడా అడిగిన మొత్తం ఇచ్చేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

కమీషన్లు రూ. కోట్లలోనే..

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా 2 లక్షలకు పైగా ఇళ్లను గత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మంజూరు చేసింది. విశాఖ నగర పరిధిలో ఇళ్లు మంజూరు చేసినప్పటికీ.. టీడీపీ నేతలు కేసులు వేసి స్థలాలు ఇవ్వకుండా తాత్సారం చేశారు. చివరకు కోర్టులో కేసులు తేలిన తర్వాత జగనన్న కాలనీల్లో 2023 చివర్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ఫలితంగా విశాఖ పరిధిలో నిర్మాణం పూర్తయిన ఇళ్ల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇంకా నిర్మాణంలో ఉన్నవి, ప్రారంభించాల్సిన ఇళ్ల సంఖ్య లక్షకు పైగానే ఉంది. ఇదే ఇప్పుడు అధికారులకు కలిసొచ్చింది. వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలన్న కేంద్రం ఆదేశాలతో కాంట్రాక్టర్లు పరుగు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధికారులు కూడా వసూళ్లకు తెగబడినట్టు తెలుస్తోంది. ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున ఇవ్వాలంటూ గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారి ఒకరు టార్గెట్ విధించారు. ఇది చిన్న మొత్తంగా కనిపిస్తున్నప్పటికీ.. మొత్తం లెక్కిస్తే మాత్రం కళ్లు బైర్లు కమ్మాల్సిందే. ఒక్క విశాఖ జిల్లాలోనే నిర్మాణంలో ఉన్నవి, ప్రారంభం కావాల్సిన ఇళ్ల సంఖ్య 1,06,303 ఉన్నాయి. అంటే ఒక్కో ఇంటికి రూ.500 చొప్పున లెక్కిస్తే సదరు అధికారి వసూళ్ల లక్ష్యం రూ.5.31 కోట్లకు పైమాటే. అనకాపల్లి, అల్లూరి జిల్లాలను కూడా కలిపి లెక్కిస్తే గృహ నిర్మాణ శాఖ అధికారుల వసూళ్ల మొత్తం సుమారు రూ.10 కోట్లకు చేరుతుంది. అంతేకాకుండా కింది స్థాయిలోని అధికారులతో పాటు నామినేటెడ్ పోస్టులోని మరో కూటమి నేత కూడా ఇంటికి ఇంత చొప్పున వసూళ్లకు తెగబడినట్టు సమాచారం. ఈ మొత్తం కలుపుకుంటే రూ.15 కోట్లకు చేరుకుంటుందని అంచనా.

ఇళ్ల నాణ్యతపై నీలినీడలు?

కూటమి ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలపై కినుక వహించింది. గృహ నిర్మాణాల్లో అవకతవకలు జరిగాయంటూ నానా యాగీ చేసింది. దీనిపై విచారణ చేపట్టాలంటూ హడావుడి చేసింది. గృహ నిర్మాణ లబ్ధిదారులందరూ అసలైన అర్హులు కావడంతో కిమ్మనకుండా ఉండిపోయింది. విచారణ పేరుతో పుణ్యకాలం కాస్తా గడిపింది. గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయకపోతే రాయితీ మొత్తాన్ని ఇవ్వబోమని కేంద్రం నుంచి గట్టిగా వార్నింగ్ వచ్చింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది మార్చిలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలంటూ ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇదే అదనుగా కట్టే ప్రతీ ఇంటికీ తమ వాటాగా రూ.500 ఇవ్వాలంటూ జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి కాంట్రాక్టర్లను డిమాండ్ చేస్తున్నారు. దీనికి తోడు నామినేటెడ్ పోస్టులోని కూటమి నేతతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా తమ వంతు వాటా ఇవ్వాలంటూ ఒత్తిళ్లు తెస్తున్నారు. వచ్చే ఏడాదిలోగా పూర్తి చేయాలన్న ఆదేశాలు ఒకవైపు.. వసూళ్ల డిమాండ్ మరోవైపు ఉండటంతో పేదల ఇళ్ల నిర్మాణాల నాణ్యతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి.

పేదల ఇళ్ల నిర్మాణాలు

విశాఖ జిల్లాలో...	
మంజూరైన ఇళ్లు	1,14,795
పూర్తయిన ఇళ్లు	8,492
నిర్మాణ పనులు మొదలైన ఇళ్లు	91,219
ప్రారంభం కావల్సినవి	15,084
అనకాపల్లి జిల్లాలో..	
మంజూరైన ఇళ్లు	65,800
పూర్తయిన ఇళ్లు	28,910
వివిధ దశల్లో నిర్మాణంలోని ఇళ్లు	19,278
ప్రారంభం కావల్సినవి	17,627
అల్లూరి జిల్లాలో..	
మంజూరైన ఇళ్లు	56,852
పూర్తయిన ఇళ్లు	3,350
వివిధ దశల్లో నిర్మాణంలోనివి	49,798
ప్రారంభం కావాల్సినవి	3,527

వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం



ఎయిర్‌పోర్టు లాంజ్‌లో జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు

సాక్షి, విశాఖపట్నం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి గురువారం విశాఖ ఎయిర్‌పోర్టులో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఆయన తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 12.42 గంటలకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టు వీఐపీ లాంజ్‌లో వైఎస్సార్ సీపీ నాయకులతో భేటీ అయ్యారు. అనంతరం 1.19 గంటలకు హెలికాప్టర్‌లో పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు బయలుదేరారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీ పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పరామర్శించి తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు 4.13 గంటలకు చేరుకున్నారు. ఇక్కడ నుంచి 6.20 గంటలకు విమానంలో బెంగళూరుకు బయలుదేరారు. జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికినవారిలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ, మాజీఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, కన్నబాబురాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, సమన్వయకర్తలు కె.కె.రాజు, తిప్పల దేవన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, ముఖ్యనేతలు జి.వెంకటేశ్వరావు, బొడ్డేడ ప్రసాద్, గొలగాని శ్రీనివాస్, ఈర్లె అనురాధ, కార్పొరేటర్లు బాణాల శ్రీనివాసరావు, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, వంశీరెడ్డి, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగం అధ్యక్షులు జాన్‌వెస్లీ, పేడాడ రమణకుమారి, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, పీలా వెంకటలక్ష్మి, పైలా శ్రీనివాసరావు, దొడ్డి కిరణ్, జీలకర్ర నాగేంద్ర ఉన్నారు. జగన్‌తో పాటు పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, కృష్ణమోహన్‌రెడ్డి ఉన్నారు.

మాజీ సీఎం జగన్ భద్రతపై ఆందోళన

- కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు

సాక్షి, విశాఖపట్నం: గుంటూరు పర్యటనలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జెడ్ సెక్యూరిటీని ఎందుకు తొలగించారని వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ కురసాల కన్నబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విశాఖ విమానాశ్రయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారని, అందుకే ఆయన కడుపు మంటను ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. కనీస సెక్యూరిటీ ఇవ్వకుండా రాక్షస ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వైఎస్ జగన్ జనం మనిషి అని, ఆయన్ని అడ్డుకోవడం మీ వల్ల కాదన్నారు. కనీస మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు భరోసా కల్పించేందుకు వైఎస్ జగన్ వెళ్లేంత వరకు ఈ రాష్ట్ర ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఆయన రైతులను పరామర్శిస్తే.. చంద్రబాబు కేంద్రానికి లేఖ రాసి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. పైగా రైతులను పరామర్శించినందుకు వెళ్లిన జగన్‌పైనే కేసులు పెట్టి, చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల నిబంధనలు ఉన్నాయని కేసులు పెడితే.. మరి మీరు నిర్వహించిన మ్యూజికల్ నైట్‌కు ఎన్నికలు నిబంధనలు అడ్డురాలేదా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ భద్రతపై తామంతా ఆందోళన చెందుతున్నామని, యథావిధిగా ఆయన భద్రత కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని.. రాష్ట్ర ప్రభుత్వాన్ని మందలించాలని విజ్ఞప్తి చేశారు.

పది, ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు

మహారాణిపేట: రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్ గురువారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గ్రూప్-2, ఇంటర్మీడియట్ ప్రధాన, ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షలు, పీ-4 విధానాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో చేపట్టిన చర్యలను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ వివరించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఏడీసీపీ రాజ్ కమల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



విశాఖ సిటీ : వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. రైతు విభాగం అధ్యక్షుడిగా బోని అప్పల నాయుడు(భీమిలి), పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మామిడి శివరామకృష్ణ(భీమిలి), గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా కర్రి రామరెడ్డి(విశాఖ ఉత్తర), ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా వడ్డాది దిలీప్‌కుమార్(విశాఖ దక్షిణ), అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా సర్వసిద్ధి సాయి లత(విశాఖ పశ్చిమ)లను నియమించారు. అలాగే సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా వంకాయల మారుతీప్రసాద్(భీమిలి), ఐటీ విభాగం అధ్యక్షులుగా లావణ్య చిమట(భీమిలి), డాక్టర్స్ విభాగం అధ్యక్షులుగా కె.వి.ఎస్.కల్యాణ్(గాజువాక), పబ్లిసిటీ విభాగం అధ్యక్షులుగా బగతి విజయ(విశాఖ ఉత్తర) నియమితులయ్యారు.

పదోన్నతిపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ బదిలీ



రాజా రెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం డైరెక్టర్ రాజారెడ్డి పదోన్నతిపై బదిలీ అయ్యారు. బీహార్‌లోని దర్బంగ ఎయిర్‌పోర్టు జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఆయన 2023 జూన్‌లో విశాఖ ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌గా విధుల్లోకి చేరారు. 19 నెలల ఆయన హయాంలో విమానాశ్రయంలో ఎన్నో సంస్కరణలు చేశారు. ప్రయాణికుల సమయాన్ని వృథా కాకుండా ఆధునిక సాంకేతికతను అమల్లోకి తెచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ డైరెక్టర్‌గా జాయింట్ జనరల్ మేనేజర్ ఎస్.పురుషోత్తంకు బాధ్యతలు అప్పగించారు.

ముగ్గురి డిశ్చార్జ్.. ముగ్గురి చేరిక

మహారాణిపేట: గులియన్ బారే సిండ్రోమ్‌తో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో గురువారం ముగ్గురు డిశ్చార్జ్ అయ్యారు. ఇదే వ్యాధి లక్షణాలతో మరో ముగ్గురు కేజీహెచ్‌లో చేరారు. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య ఏడుకు చేరింది. ఈ వ్యాధి లక్షణాలు కలిగిన ఒక మహిళ సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. మొత్తం ఏడుగురు కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగంలో చికిత్స పొందుతున్నారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు ఏర్పాట్లు

మహారాణిపేట: ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ గురువారం సమీక్షించారు. కలెక్టరేట్ వీసీ హాల్లో జిల్లా అధికారులు, ఏపీపీఎస్సీ అధికారులు, పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో ప్రత్యేకంగా సమావేశమైన, పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఉదయం(10-12.30) మధ్యాహ్నం (3-5.30) రెండు పూటలా జరిగే పరీక్షకు 15 నిముషాలు గ్రేస్ పీరియడ్ దాటాక వచ్చేవారిని అనుమతించేది లేదన్నారు. దివ్యాంగులకు, గర్భిణులకు సాధ్యమైనంత మేరకు మొదటి అంతస్తులోనే పరీక్ష గదుల్ని కేటాయించాలని చెప్పారు. ఇన్విజిలేటర్లు నిబంధనలు పాటించాలని, పరీక్షకు 5 నిముషాల ముందు మాత్రమే సీల్డ్ కవర్లో ఉన్న ప్రశ్నా పత్రాలను తెరవాలన్నారు. మాస్ కాపీయింగ్, ఇతర సంఘటనలు జరిగాయని పేర్కొంటూ ఆధారం లేకుండా తప్పుడు వార్తలను, సమాచారాన్ని చేరవేసే వారిపై నిఘా ఉంటుందని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఏడీసీపీ రాజ్ కమల్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ అశోక్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వీఆర్ఎస్‌పై వీడని ఉత్కంఠ

విడుదల కాని ఉన్నతాధికారుల జాబితా

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్(వీఆర్ఎస్) జాబితాపై ఉత్కంఠ కొనసాగుతోంది. కార్మికులు, కనిష్ట స్థాయి అధికారుల జాబితా విడుదలైనప్పటికీ ఈ5, ఆ పైస్థాయి అధికారుల జాబితాపై సస్పెన్స్ అలానే ఉంది. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం జారీ చేసిన వీఆర్ఎస్ స్కీమ్‌లో బుధవారం నుంచి అమలు చర్యలు ప్రారంభించారు. మొదటి విడతగా నాన్ వర్క్స్‌కు చెందిన కార్మికులు, ఈ4 స్థాయి వరకు అధికారుల జాబితా విడుదల చేశారు. గురువారం వర్క్స్‌కు చెందిన కార్మికులు, ఈ4 స్థాయి అధికారులతో కూడిన 826 మంది జాబితా వెల్లడించారు. వారికి ఈపీఎస్ పోర్టల్‌లో వీఆర్ఎస్ ఆమోదం పొందినట్లు పేర్కొన్నారు. ఆయా హెచ్‌ఆర్ జోనల్ కార్యాలయాల్లో అధికారిక పత్రాలు అందించారు. అయితే ఈ5, ఆ పైస్థాయి అధికారులకు చెందిన నాన్ వర్క్స్, వర్క్స్ జాబితాలు ఇప్పటి వరకు విడుదల కాలేదు. ఉన్నత యాజమాన్యం పరిధిలో ఉండే ఆ జాబితాకు ఆమోదం లభించక పోవడం వల్లే పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా వీఆర్ఎస్ స్కీమ్ నిబంధనలకు విరుద్ధంగా అమోదం పొందిన కొంత మందిని ఉన్నత యాజమాన్యం గుర్తించి, వారిని పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. ఇప్పటికే తిరస్కరణకు గురైన వారికి ఈ నెల 22 వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఇచ్చారు.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యానికి సమ్మె నోటీసు



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్‌కు ర్యాలీగా వెళ్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

మార్చి 7 తర్వాత సమ్మె

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై మార్చి 7 తర్వాత సమ్మె చేయనున్నట్లు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో కార్మిక సంఘాలు గురువారం సెంట్రల్ స్టోర్స్ కూడలి నుంచి ఉక్కు అడ్మిన్ కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించాయి. అక్కడ జరిగిన సమావేశంలో సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను దొడ్డిదారిన తొలగించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే సుమారు 300 మందిని తొలగించినట్లు పేర్కొన్నారు. మరోవైపు ఎస్ఎంఎస్, ఏఎస్ఎంఎస్‌ను తొలగించాలని చూస్తున్నారన్నారు. పాత పద్ధతిలో గేటు పాసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టుల్లో నిర్వాసిత ఖాళీలను నిర్వాసితులతోనే భర్తీ చేయాలన్నారు. అనంతరం ప్లాంట్ యాజమాన్య ప్రతినిధులకు సమ్మె నోటీసు అందించారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, మంత్రి రవి, వంశీ, కోన అప్పారావు, ఉమ్మిడి అప్పారావు, వి.వి.రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యుడిది హత్యే

- 'అస్థి పంజరం' కేసులో వీడిన మిస్టరీ
- పూజ చేసేందుకు వెళ్లి మహిళపై జ్యోతిష్యుడు అత్యాచారం
- అప్పన్నను హత్య చేసిన ఆమె భర్త
- భార్యాభర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు



అప్పన్న(ఫైల్ ఫొటో)

కొమ్మాది: పెందుర్తి బీసీ కాలనీకి చెందిన జ్యోతిష్యుడు మోతి అప్పన్న అలియాస్ అప్పన్న దొర (50) అస్థి పంజరం కేసు మిస్టరీ వీడింది. భీమిలి నేరెళ్లవలసకు చెందిన భార్యాభర్తలు గుడ్డాల మౌనిక, ఊళ్ల చిన్నారావు పథకం ప్రకారం అతన్ని హత్య చేశారు. ఘటనా స్థలంలో లభించిన వస్తువులు, సీసీ ఫుటేజ్, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా భీమిలి పోలీసులు నిందితులను గుర్తించి గురువారం అరెస్ట్ చేశారు. భీమిలి సీఐ బి.సుధాకర్ తెలిపిన వివరాలివి..

పెందుర్తి బీసీ కాలనీకి చెందిన మోతి అప్పన్న.. భార్య కొండమ్మ, కుమారులు ప్రసాద్, దుర్గా ప్రసాద్‌లతో కలిసి నివాసం ఉంటున్నాడు. ఆయన ఇంటింటికీ వెళ్లి జ్యోతిష్యం చెబుతుంటాడు. ఇబ్బందుల్లో ఉన్న వారి ఇళ్లలో పూజలు చేస్తూ.. తద్వారా వచ్చిన ఆదాయంతో తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా ఆయన ఈ నెల 9న ఆనందపురం వెళ్తున్నట్లు ఇంటి వద్ద చెప్పాడు. ఆ రోజు రాత్రి అప్పన్న ఇంటికి రాకపోవడంతో 10న ఆయన పెద్ద కుమారుడు దుర్గా ప్రసాద్ ఆనందపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా ఉప్పాడ ప్రాంతంలో అప్పన్న తప్పిపోయినట్లు గుర్తించి, ఆ ప్రాంతంలో అతని కుటుంబ సభ్యులు, పోలీసులు గాలించారు. అక్కడ ఓ ప్రైవేట్ లేఅవుట్‌లో అప్పన్నకు సంబంధించిన అవశేషాలు గుర్తించారు.

పథకం ప్రకారం.. కత్తితో పొడిచి

కాగా.. నిందితులు నెల రోజుల కిందట ఆనందపురం మండలం లొగడలవానిపాలెంలో ఒక అద్దె ఇంట్లో దిగారు. అక్కడకు సమీపంలో ఉన్న యడ్ల తిరుపతమ్మ అనే టీ దుకాణం యజమానితో వారికి పరిచయం ఏర్పడింది. అదే టీ దుకాణానికి ప్రతి మంగళ, ఆదివారాల్లో అప్పన్న దొర వస్తుండేవాడు. చుట్టు పక్కల గ్రామాల్లో వాస్తు, పూజలు చేస్తుండేవాడు. తనకు కూడా సమస్యలు ఉన్నాయని, పరిష్కరించాలని నిందితురాలు అప్పన్నకు చెప్పగా ఇంటికి వచ్చి పూజలు చేస్తానని చెప్పాడు. ఈ క్రమంలో మౌనిక ఇంటికి వెళ్లిన అప్పన్న ఆమెతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెపితే కుటుంబాన్ని నాశనం చేస్తానని బెదిరించాడు. ఆమె ఈ విషయాన్ని తన భర్త చిన్నారావుకు తెలియజేయగా అప్పన్న దొరను హత్య చేయడానికి పథకం వేశారు. ఉప్పాడలో ఉన్న తన తల్లికి ఆరోగ్యం సరిగా లేదని, పూజ చేయాలని చిన్నారావు అప్పన్నను నమ్మించాడు. రూ.7 వేలు ఇవ్వడానికి ఒప్పందం చేసుకున్నాడు. ఈ నెల 9న బటన్ కత్తి, పల్సర్ బైక్ తెప్పించుకుని అతన్ని ఆనందపురం మండలం క్రాస్ రోడ్డు, బోయపాలెం మీదుగా భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ లే అవుట్‌కు తీసుకువెళ్లాడు. అతన్ని కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ క్రమంలో జరిగిన పెనుగులాటలో చిన్నారావు కుడిచేతి చూపుడు వేలికి గాయం కాగా కేజీహెచ్‌లో చికిత్స తీసుకున్నాడు.

ఒక రోజు ఆగి..

ఆధారాలు లేకుండా చేసేందుకు తర్వాత రోజు టిన్నర్, పెట్రోల్ కొనుగోలు చేశాడు. 11వ తేదీ వేకువజాము 4 గంటల సమయంలో రెండు లీటర్ల టిన్నర్, మరో రెండు లీటర్ల పెట్రోల్ తీసుకొని తన భార్యతో కలిసి బయలుదేరాడు. ఉదయం ఆరు గంటల సమయంలో మృతదేహాన్ని కాల్చివేశాడు. ఘటనా స్థలంలో లభించిన వస్తువులు ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. తన భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించాడనే కోపంతో చిన్నారావు జ్యోతిష్యుడిని హత్య చేశాడని, ఈ ఘటనలో భర్తకు మౌనిక సహకారం అందించడంతో ఇద్దరినీ అరెస్ట్ చేసినట్లు సీఐ బి.సుధాకర్ తెలిపారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు బటన్ కత్తి, రక్తపు మరకలు కలిగిన నిందితుడి జీన్ ప్యాంటు, అప్పన్నదొర ఫోన్ పౌచ్, లైటర్, పల్సర్ ద్విచక్రవాహనం, కీ పాడ్ మొబైల్ స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు.

విశాఖలో హైకోర్టు బెంచ్ కోరుతూ 23న సదస్సు

విశాఖ లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఈ నెల 23న జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ నూతన కార్యాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన న్యాయవాదులతో సదస్సు నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బెవర సత్యనారాయణ తెలిపారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు డిమాండ్ 1993 నుంచి ఉందని, ప్రస్తుతం హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో 43 శాతం ఈ ప్రాంతానికి చెందినవేనని పేర్కొన్నారు. విశాఖలో హైకోర్టు బెంచ్‌తో పాటు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం జస్టిస్ ఎట్ డోర్ స్టెప్స్ నినాదంతో జరిగే ఈ సదస్సులో కార్యాచరణను రూపొందిస్తామన్నారు. తొలి దశలో రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన మంత్రి, కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాష్ట్ర గవర్నర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ముఖ్యమంత్రి, రాష్ట్ర న్యాయ శాఖ మంత్రికి వినతి పత్రాలు సమర్పిస్తామని తెలిపారు. మలిదశలో ప్రజాప్రతినిధుల సహకారంతో కార్యక్రమాలు రూపొందిస్తామని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు పక్కాగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఏఆర్వోలను ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఎన్నిక నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి ఎన్నికను ప్రశాంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితా రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సాంకేతికపరమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలన్నారు. పోలింగ్ మెటీరియల్ అందజేత, స్వీకరణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. పోలింగ్ ముందు రోజే సిబ్బంది ఆయా కేంద్రాలకు చేరుకోవాలని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలపాలని, కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏఆర్వోలు, పోలీసు అధికారులు అక్కడి పరిస్థితులను రిటర్నింగ్ అధికారికి వివరించారు. విశాఖ జిల్లా ఏఆర్వో బీహెచ్.భవానీ శంకర్, అల్లూరి జిల్లా ఏఆర్వో పద్మలత, అనకాపల్లి జిల్లా ఏఆర్వో పీవీఎస్ఎస్ఎన్ సత్యనారాయణ, విజయనగరం జిల్లా ఏఆర్వో శ్రీనివాసమూర్తి, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల ఏఆర్వోలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నకిలీ ఎస్‌ఐ

- విద్యార్థులను బెదిరిస్తూ శాంతినగర్‌లో హల్ చల్



నకిలీ ఎస్‌ఐ దుర్గారావును ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగిస్తున్న యువకులు

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు పోలీసులు నకిలీ ఎస్‌ఐని అదుపులోకి తీసుకున్నారు. వివరాలివీ.. శాంతినగర్‌లో గురువారం సాయంత్రం బోను దుర్గారావు అనే వ్యక్తి ఎస్‌ఐ ఐడీ కార్డుతో తిరుగుతూ కనిపించాడు. పాఠశాల విడిచిపెట్టడంతో విద్యార్థులు బయటకు వస్తుండగా, వారిని బెదిరించాడు. అసభ్య పదజాలంతో దూషిస్తూ, 'మీ మీద 100 డయల్‌కు ఫిర్యాదు వచ్చింది. నేను స్పెషల్ టీమ్ ఎస్‌ఐ'ని అంటూ భయపెట్టాడు. ఇది గమనించిన శాంతినగర్ యువకులు అతన్ని నిలదీశారు. తాను ఎస్‌ఐనని, సీసీఎస్‌కు చెందిన వాడినని బుకాయించే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ యువకులు ఐడీ కార్డు చూపించాలని పట్టుబట్టడంతో చూపించాడు. అది నకిలీ ఐడీ అని గుర్తించిన యువకులు, దుర్గారావును ఎయిర్‌పోర్టు కానిస్టేబుల్‌కు అప్పగించారు. దుర్గారావుది విజయనగరం జిల్లా మక్కువ మండలంగా పోలీసులు గుర్తించారు. అతను కంచరపాలెంలో స్నేహితుడి ఇంటి వద్ద ఉంటూ, కూలీ పనులు చేస్తుంటాడు. శాంతినగర్‌లో తెలిసిన వారి ఇంటికి వచ్చానని, విద్యార్థులు అల్లరి చేస్తుంటే ఆపడానికి మాత్రమే అలా బెదిరించానని, వేరే ఉద్దేశం లేదని దుర్గారావు చెబుతున్నాడు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టు పోలీసులు దుర్గారావును విచారిస్తున్నారు.

కళాభారతిలో నృత్యోత్సవం నేడు

మద్దిలపాలెం: కూచిపూడి కళాక్షేత్రం 40 వసంతాలు పురస్కరించుకొని సంస్థకు చెందిన 100 మంది విద్యార్థులతో శుక్రవారం కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవం ఏర్పాటు చేశారు. ఇదే వేదికపై నరకాసుర సంహరణ నృత్యరూపకం ప్రదర్శిస్తామని కూచిపూడి కళాక్షేత్ర హెచ్‌ఆర్ కన్నం వెంకటరమణారావు తెలిపారు. కూచిపూడి కళాక్షేత్రాన్ని పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వెంపటి చినసత్యం చేతులమీదుగా ప్రారంభించినట్లు గుర్తు చేశారు. గురువు హరి రామమూర్తి నేతృత్వంలో ఇప్పటివరకు 4 వేల మంది నృత్య కళాకారులను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని, విజయవంతం చేయాలని వెంకటరమణారావు కోరారు.

'జ్ఞానజ్యోతి' వెలుగులు

- మారనున్న అంగన్‌వాడీ చదువులు
- కార్యకర్తలకు ముగిసిన మొదటి విడత శిక్షణ



పిల్లలకు ఆటపాటలతో ఏ విధంగా బోధించాలో నేర్చుకుంటున్న కార్యకర్తలు



మాధవధార స్కూల్‌లో ఏర్పాటు చేసిన శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

విశాఖ విద్య: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా అంగన్ వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు గల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా 'జ్ఞాన జ్యోతి'పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ కేంద్రా లకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో 'పోషణ్ భీ- పఢాయి భీ'పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకనుగుణంగానే కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖాధికారులు పటిష్టమైన కార్యాచరణ సిద్ధం చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే పటిష్టమైన పునాదులు

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్‌ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0-6 సంవత్సరాల వయసు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్‌కు దిక్సూచిగా నిలువాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సైతం మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు, ప్రతీ కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

జ్ఞానజ్యోతి లక్ష్యమిదే..

ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్(పూర్వ ప్రాథమిక విద్య), పునాది అభ్యసన కొనసాగింపు కోసం రోడ్ మ్యాపు అభివృద్ధి చేయడం..

- అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు, 1-2 తరగతుల ఉపాధ్యాయుల సామర్థ్యాలను పెంపొందించడంలో భాగంగా వారికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం..
- జిల్లాలో మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, వాటికి అనుసంధానంగా ప్రాథమిక పాఠశాలలను అభివృద్ధి చేయడం..

అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ

జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఈ నెల 18 నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రీ ప్రైమరీ, 1, 2 తరగతులను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా వీరికి మెళకువలు నేర్పిస్తున్నారు. జిల్లాలోని 776 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 11 కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక శిక్షణ గురువారంతో మొదటి దశ ముగిసింది. తిరిగి ఈ నెల 22 నుంచి 25 వరకు రెండో దశ శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధన నైపుణ్యతను పెంపొందించడమే లక్ష్యంగా సర్టిఫికెట్ కోర్సులో భాగంగా120 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు.

పకడ్బందీగా శిక్షణ తరగతులు



జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ఫోకస్ పెట్టాం. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ ప్రోగ్రాంలో భాగంగా ఇప్పటికే 1, 2వ తరగతులు బోధించే జిల్లాలోని 560 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– డాక్టర్ జి.చంద్రశేఖరరావు, సమగ్ర శిక్ష ఏపీసీ, విశాఖ జిల్లా

బలీయంగా తొలి అడుగులు



పిల్లల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడ నుంచే స్కూళ్లకు వస్తారు. అందుకనే ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. ఇందుకోసం ఐసీడీఎస్, విద్యా శాఖ సంయుక్తంగా శిక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నాం.

– దివాకర్, ఎంఈవో, గోపాలపట్నం మండలం

ఆవు కడుపులో 50 కిలోల పాలిథిన్

- శస్త్రచికిత్స చేసి, బయటకు తీసిన పశు వైద్యుడు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలసలో ఓ ఆవు పొట్ట నుంచి గురువారం 50 కిలోల పాలిథిన్‌ను పశువైద్యుడు బయటకు తీశారు. పాడి రైతు కోరాడ నాయుడుబాబుకు చెందిన ఈ ఆవు ఐదు రోజులుగా కడుపులో నొప్పి, మేత తినలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతోంది. ఇది గమనించిన రైతు ఆనందపురం పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌ను సంప్రదించారు. ఆవును పరీక్షించి, రుమేనటమీ శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. గురువారం డాక్టర్, అతని బృందం శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి ఆవు కడుపు నుంచి దాదాపు 50 కిలోల పాలిథిన్ కవర్లు, తాళ్లను వెలికితీశారు. పాలిథిన్ వ్యర్థాలు పశువులకు ఎంత ప్రమాదకరమో ఈ సంఘటన తెలియజేస్తుందని డాక్టర్ అన్నారు. పాలిథిన్ కారణంగా మూగజీవాలు మృత్యువాత పడకుండా ఉండాలంటే.. ప్రజలు పాలిథిన్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. పశువైద్య సిబ్బంది సుజాత, దుర్గ, లక్ష్మి, రమణ, సంతోష్, సాగర్, సుబ్రహ్మణ్యం, నర్సింగ్ డాక్టర్ అనిల్‌కుమార్‌కు సహకరించారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు మీల్ కార్డు నగదు జమ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు గురువారం మీల్ కార్డు నగదు జమ చేశారు. నాలుగు నెలలు పెండింగ్‌లో ఉండగా ఒక నెల నగదు మాత్రమే జమ అయింది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ప్రతి నెలా మీల్ కార్డు కోసం.. రోజుకు రూ.100 చొప్పున పని దినాల ఆధారంగా జీతం నుంచి కోత విధించి మీల్ కార్డులో జమ చేస్తారు. అయితే నాలుగు నెలలుగా ఉద్యోగుల జీతాల నుంచి కోత విధించడం తప్ప మీల్ కార్డుకు జమ కావడం లేదు. దీంతో ప్రతీ ఉద్యోగికి రూ.10 వేల వరకు బకాయి పేరుకుపోయింది. ఉక్కు యాజమాన్యం మీల్ కార్డు సంస్థకు దాదాపు రూ.14 కోట్లు బకాయి పడటంతో, వారు నాలుగు నెలలుగా నగదు జమ చేయడంలో విముఖత చూపినట్లు తెలుస్తోంది. చివరికి ఉక్కు అధికారులు మీల్ కార్డు సంస్థ అధికారులతో జరిపిన చర్చలు ఫలించడంతో, ఒక నెలకు సంబంధించిన నగదును ఇప్పుడు జమ చేశారు. అయితే మిగిలిన మూడు నెలల బకాయిల సంగతేమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

చర్లపల్లి-దానాపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: చర్లపల్లి-దానాపూర్-చర్లపల్లి(07791/07792) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20 తేదీ నుంచి 28వ తేదీ వరకు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

లోకో రన్నింగ్ సిబ్బంది 36 గంటల దీక్ష



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న లోకో పైలట్లు

తాటిచెట్లపాలెం: ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో దొండపర్తిలో గల డీఆర్‌ఎం కార్యాలయం వద్ద 36 గంటల నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభించారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో గల లోకో రన్నింగ్ సిబ్బంది గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభించిన ఈ దీక్షను శుక్రవారం రాత్రి 8 గంటల వరకు కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్సీ పాణిగ్రాహి, భోలానాథ్‌లు మాట్లాడుతూ ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లకు 6 గంటలు, గూడ్స్ రైళ్లకు 8 గంటలు డ్యూటీ పరిమితి అమలుచేయాలని కోరారు. రైల్వేలో మిగతా ఉద్యోగులంతా 8 గంటలు డ్యూటీ చేస్తే లోకోపైలట్లకు మాత్రం సుమారు 11 గంటల వరకు డ్యూటీ ఉంటుందన్నారు. రైళ్ల నిర్వహణలో భద్రతను నిర్ధారించడానికి డ్యూటీ గంటలను తగ్గించాలని వివిధ హైపవర్ కమిటీలు సిఫార్సు చేసినా.. రైల్వే మంత్రిత్వ శాఖ పట్టించుకోవడం లేదన్నారు. లోకో పైలట్స్ డ్యూటీ వేళలను 8 గంటలకు తగ్గించాలని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సిఫార్సులు కూడా రైల్వే మంత్రిత్వ శాఖ గాలికొదిలేసిందన్నారు. ముఖ్యంగా గూడ్స్ రైళ్లలో లోకో పైలట్లు 12 నుంచి 20 గంటల వరకు డ్యూటీ చేయాల్సి వస్తుందని, దీనివల్ల తీవ్ర ఒత్తిడికి గురవ్వడం, అనారోగ్యం పాలవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ దీక్షలో బివిఎస్‌వి రాజు, ఎస్‌కే చౌదరి, ఎం.చిన్న పాల్గొన్నారు.

'సాల్ట్' రద్దుతోనే విద్యా రంగానికి రక్షణ

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కిశోర్ కుమార్



మాట్లాడుతున్న కిశోర్ కుమార్

విశాఖ విద్య: రాష్ట్ర ప్రభుత్వ విద్యారంగాన్ని సాల్ట్ పథకం విచ్ఛిన్న దశకు తీసుకెళుతోందని, దీన్ని వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్ డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన యూటీఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాల్ట్ పథకం వల్ల ఒకటి, రెండు తరగతులు మారినటువంటి పాఠశాలల సంఖ్య 12 వేలకు పైగా ఉన్నాయని, అక్కడ చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం కష్టంగా ఉందన్నారు. జీవో నంబర్ 117 రద్దు చేసి నూతన జీవో కోసం చేస్తున్న కసరత్తుతో ప్రాథమిక పాఠశాల వ్యవస్థ మూసివేత గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం సాల్ట్ పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహన్‌రావు మాట్లాడుతూ సాల్ట్ పథకం వల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనపడితే భవిష్యత్‌లో ఉన్నత పాఠశాలలు కూడా బలహీనమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పథకం వల్ల రోజు వారి గణాంకాలు సేకరించాల్సి ఉందని, దీని వల్ల బోధనకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, విశాఖ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్, కోశాధికారి రాంబాబు, సహాధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

సాగరతీరంలో శోభాయాత్ర

- వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



బీచ్‌రోడ్డులో విగ్రహాల ఊరేగింపు



శోభాయాత్రలో పాల్గొన్న మహిళలు, హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: విశాఖ సాగర తీరం హరినామ సంకీర్తనలతో పులకించింది. హరే కృష్ణ హరే కృష్ణ...హరే రామ హరే రామ అంటూ భక్తజనం నృత్యాలు చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో.. విశ్వశాంతిని కాంక్షిస్తూ బీచ్‌రోడ్డులోని పార్క్ హోటల్ కూడలి నుంచి గోకుల్ పార్క్ వరకు గురువారం నిర్వహించిన శోభాయాత్ర నగరంలో ఆధ్యాత్మిక శోభను నింపింది. పుష్పాలతో సుందరంగా అలంకరించిన రథంపై భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులు, రాధా మదన మోహన స్వామి, నితాయి గౌరాంగాల విగ్రహాలను ఊరేగించారు. భక్తులు రథాన్ని తాళ్లతో లాగుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అంతర్జాతీయ వ్యవస్థాపకుడు భక్తి వేదాంత స్వామి ప్రభుపాదులకు మహా కుంభమేళాలో అఖిల భారతీయ అఖాడా పరిషత్ 'విశ్వగురు' బిరుదు ప్రదానం చేసిన సందర్భం, 52 సంవత్సరాల కిందట విశాఖలో జరిపిన పాదయాత్రను గుర్తు చేస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా వాయిద్యాలు, కోలాటం, సంకీర్తనలతో భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. సందర్శకులకు దారిపొడవునా ప్రసాదం పంపిణీ చేశారు. హవా మహల్‌లో రాధా మదన్ మోహన్ స్వామి, నితాయి గౌరాంగ, భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల విగ్రహాలకు హారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని దారిపొడవునా భక్తి గీతాలు ఆలపిస్తూ, కోలాటం ఆడారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వి.రామకృష్ణబాబు, హరేకృష్ణ మూవ్‌మెంట్-అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు అమితాసన దాస స్వామీజీ, విశాఖ అధ్యక్షుడు నిష్కించిన భక్త దాస తదితరులు పాల్గొన్నారు.

సంద్రంలో ముచ్చట్లు



నేలను నమ్మి రైతులు వ్యవసాయం చేస్తే, నీటిని నమ్మి చేపల వేట చేస్తారు మత్స్యకారులు. వీరి జీవితం ఎన్నో సవాళ్ల ప్రయాణం. సముద్రంలోకి వెళ్లకపోతే భవిష్యత్ ఏమిటనేది సవాలు.. వల వేసి, చేపలు పట్టడం, ఒడ్డుకి తెచ్చాక, సరైన ధరకు అమ్ముకోవడం ఓ సవాలు.. ఇలా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ వారు జీవన పోరాటం సాగిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండు పడవలపై వేటకు వెళ్లిన మత్స్యకారులు గురువారం ఆర్.కె. బీచ్ వద్ద ఎదురురెదురుగా తారసపడ్డారు. ఈ క్రమంలో ముచ్చటించుకుంటుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

– ఏయూక్యాంపస్/ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరి అరెస్ట్

అల్లిపురం: గాజువాకకు చెందిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుడిని క్రికెట్ బెట్టింగ్ ఊబిలో దింపి, అతని దగ్గర నుంచి డబ్బులు కాజేసిన విజయనగరానికి చెందిన ముఠాలోని ఇద్దరు క్రికెట్ బుకీలను సాంకేతిక పరిజ్ఞానంతో పట్టుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. అరెస్ట్ అయిన నిందితుల ద్వారా త్వరలోనే మరింత మందిని అరెస్ట్ చేస్తామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ప్రజలకు ఆశ చూపించి లక్షలు కొల్లగొడుతున్నారని, అటువంటి వాటి జోలికి ప్రజలు వెళ్లకూడదని సూచించారు.

మాతా, శిశు మరణాలు అరికట్టాలి

మహారాణిపేట: మాతా, శిశు మరణాలు అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇతర ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా మాతా, శిశు మరణాలకు అవకాశం లేకుండా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటివి రాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అతిసార వ్యాధి నియంత్రణకు ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయాలన్నారు. టీబీ, కుష్టు, హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధులు ప్రబలకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఆస్పత్రుల పనితీరుపై తరచూ సమీక్ష నిర్వహించి, తగు సూచనలివ్వాలని పేర్కొన్నారు. 108, 104 పనితీరుపై సమీక్ష జరపాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంక్ ప్రారంభం



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

పెదగంట్యాడ: పోలీసుల సంక్షేమానికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. మండలంలోని బీసీ రోడ్డు దయాల్ నగర్ ఎదురుగా పోలీస్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విశాఖలో తొలిసారిగా పోలీసుల ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పెట్రోల్ బంక్ నిర్వహణ విషయంలో రాజీ పడవద్దని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాల్లో విధిగా తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఉచితంగా గాలి అందించాలని, మరుగు దొడ్ల సదుపాయం కల్పించాలని తెలిపారు. బంక్‌లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. బీపీసీఎల్ ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో డీసీపీ-2 మేరీ ప్రశాంతి, డీసీపీ అడ్మిన్ కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీ డాక్టర్ వి.బి.రాజ్‌కమల్, ఏసీపీ-1 ఎస్‌వి అప్పారావు, హార్బర్ ఏసీపీ కాళిదాస్, గాజువాక ఏసీపీ త్రినాథ్, న్యూపోర్టు సీఐ కామేశ్వరరావు, ఎస్‌ఐలు గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడగా విద్యార్థినుల ఆరోగ్యం

- మెరుగైన చికిత్స కోసం ఒకరు కేజీహెచ్‌కు తరలింపు

పెందుర్తి: ఫుడ్ పాయిజన్ కారణంగా అస్వస్థతకు గురైన పెందుర్తిలోని ఇందిర స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సీహెచ్‌సీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.అవంతి తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు. వెన్నెల దివ్య అనే విద్యార్థినిని మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇందిర నర్సింగ్ కళాశాలలో ఫేర్‌వెల్ కార్యక్రమంలో కలుషిత ఆహారం తిని ఈ విద్యార్థినులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే.